క్లుప్తంగా

రెండు సొసైటీల రిజిస్ట్రేషన్లు రద్దు

నంద్యాల (సెంట్రల్): సహకార శాఖ పరిధిలోని రెండు సొసైటీల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా సహకార శాఖ అధికారి వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోస్పాడు మండలం సాంబవరం గ్రామానికి చెందిన శ్రీ రాజరాజేశ్వరి లేబర్ కాంటాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ, కోవెలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన కలుగొట్ల స్టోన్ కట్టర్స్ ఎల్‌సీసీయెస్ లిమిటెడ్ సహకార సంఘాల రిజిస్ట్రేషన్లు రద్దు చేశామన్నారు. ఈ రెండు సంఘాలకు ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల డివిజనల్ సహకార అధికారులను లిక్విడేటర్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సంఘాల పనితీరు బాగా లేకపోవడంతో గతంలోనే డిపాజిటర్లు, రుణదాతలకు సంబంధించి ఏవైనా పరిష్కారాలు ఉంటే తెలపాలని నోటీసులు జారీ చేశామన్నారు. కానీ ఇప్పటివరకు ఆయా సొసైటీల నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో పరిష్కార ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు.

శ్రీశైలం నుంచి నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి 1,839 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 960 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 878 క్యూసెక్కుల నీటిని వదిలారు. శుక్రవారం సాయంత్రానికి జలాశయంలో 37.4550 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యాం నీటిమట్టం 815.10 అడుగులకు చేరుకుంది.

దాడి చేసిన చిరుతపులి ఇదే



సీసీ కెమెరాల్లో కనిపించిన చిరుతపులి

మహానంది: మహానంది సమీపంలోని నల్లమల అడవిలో ఫిబ్రవరి 25వ తేదీన అటవీశాఖ ప్రొటెక్షన్ వాచర్ అజీమ్‌బాషపై చిరుతపులి దాడి చేసిన విషయం తెలిసిందే. నల్లమలలోని లెపర్డ్ బేస్ క్యాంపు వద్ద విధుల్లో ఉండగా చిరుతపులి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు అజీమ్‌బాష గురువారం వరకు నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఇంటికి చేరాడు. ఇదిలా ఉండగా లెపర్డ్ బేస్ క్యాంపు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చిరుతపులిని అటవీశాఖ అధికారులు గుర్తించారు. బేస్ క్యాంప్ చుట్టూ తిరిగినట్లు కెమెరాలో రికార్డు అయ్యింది.

ఘాట్‌రోడ్డులో ప్రమాదం



ఆత్మకూరు: ఆత్మకూరు-దోర్నాల రహదారిలో నల్లమల ఘాట్‌లోని రోళ్ల పెంట మలుపు వద్ద శుక్రవారం శ్రీశైలం నుంచి ఆత్మకూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు, కర్నూలు నుంచి విజయవాడకు వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో కొందరు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును మలుపు వద్ద తప్పించడంతో చిన్న ప్రమాదంతో బయటపడ్డారు. ఈ ప్రమాదంతో 2 గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం ఆత్మకూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి లారీని తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సోషల్ ఆడిట్‌కు ఈ-క్రాప్ బుకింగ్ జాబితాలు

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ జాబితాలను సోషల్ ఆడిట్‌కు పెట్టారు. శుక్రవారం పంటల నమోదు జాబితాలను ఆర్‌బీకేల్లో రైతుల పరిశీలనకు ఉంచారు. ఈ నెల 5 వరకు ఆర్‌బీకేల్లో సామాజిక తనిఖీల కోసం జాబితాలు పెట్టామని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు.

నల్లమల మీదుగా మల్లన్న చెంతకు!



నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్రగా వస్తున్న భక్తులు





కైలాసద్వారం వద్దకు పాదయాత్రగా చేరుకుంటన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఓం హరోం హరా, శంభో శంకరా, ఓం నమఃశివాయ అంటూ భక్తుల శివనామ స్మరణతో నల్లమల గిరులు మారుమోగుతున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మల్లన్న చెంతకు పాదయాత్రగా భక్తులు అటవీ మార్గంలో చేరుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు శుక్రవారం పలువురు శివస్వాములు, సాధారణ భక్తులు నల్లమలలో పాదయాత్ర చేసుకుంటూ శ్రీగిరి చేరుకున్నారు. ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర అక్కడి నుంచి గోసాయి కట్ట వీరాంజనేయస్వామి గుడి, నాగలూటి వీరభద్రస్వామి దేవాలయం, దామెర్లకుంట, పెద్దచెరువు, మఠం బావి, భీమునికొలను, కైలాసద్వారం అక్కడి నుంచి హఠకేశ్వరం, సాక్షి గణపతి మీదుగా శ్రీశైలం చేరుకుంటారు. మొత్తం నల్లమల అటవీప్రాంతంలో నడవాల్సి ఉంటుంది. కొండలు, గుట్టలు, వాగులు, వంకలలో నడుచుకుంటూ శ్రీగిరి చేరుకుంటారు. వృద్ధులు, మహిళలు సైతం అటవీప్రాంతంలో మొత్తం 40కిలోమీటర్లు పాదయాత్రగా శ్రీగిరికి చేరుకుంటున్నారు.

దేవస్థాన ఏర్పాట్లు

పాదయాత్రగా తరివచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. కైలాసద్వారం నుంచి భీమునికొలను మెట్ల మార్గం వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తుంది. అలాగే పెద్దచెరువు, నాగలూటి, మఠం బావి ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కైలాస ద్వారం వద్ద భక్తులు సేదతీరేందుకు భారీ షెడ్డు ఏర్పాటు చేశారు. తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. అలాగే దేవస్థానం అన్నప్రసాద భవనం నుంచి పాదయాత్ర భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు.కైలాస ద్వారం వద్ద జనరేటర్ సహాయంతో విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు.



కైలాసద్వారం వద్ద ఏర్పాటు చేసి షెడ్డులో సేదతీరుతున్న భక్తులు

పథకాలు కొనసాగాలంటే జగనన్నను గెలిపించాలి

● ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అందులోభాగంగానే జగనన్న పక్కా గృహాలకు సెంటున్నర స్థలం ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసి సర్వహక్కులు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలతో ఆర్థిక తోడ్పాటు అందిస్తోందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలన్నారు. మాయమాటలు చెప్పే చంద్రబాబుకు, కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించే జగనన్నకు ఎంతో తేడా ఉందన్నారు. మంచి చేసిన నాయకుడిని జీవితంలో మరిచిపోరాదన్నారు. ఈనెల 3న షాదీఖానా, ఆర్టీసీ బస్టాండ్‌లను ప్రారంభిస్తామన్నారు.



రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

భూమి పూజ

ఆరవ వార్డులోని మహబూబ్ మస్జీద్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డుకు రూ.10 లక్షల నిధులు కేటాయించామన్నారు. అన్ని వార్డుల్లో సీసీ రహదారులు ఏర్పాటు చేసి, పట్టణ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. అనంతరం షాదీఖానా ప్రారంభ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అంతకుముందు సిద్ధపల్లె రస్తాలోని నీటిపంపు బావిని పరిశీలించారు. పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్ రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి, కౌన్సిలర్ పార్వతి, ఎంపీపీ తిరుపాలమ్మ, ముమీన్ మునీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే ఆర్థికాభివృద్ధి

ఆత్మకూరు: అక్షరాస్యతతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని యూనియన్ బ్యాంక్ స్థానిక బ్రాంచ్ మేనేజర్ సుధాకర్ అన్నారు. భారత రిజర్వ్‌బ్యాంక్, లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ యూనియన్ సొసైటీ ఫర్ సోషియల్ ట్రాన్స్‌ఫర్ ఆధ్వర్యంలో బైర్లూటిలోని గురుకుల పాఠశాల వద్ద ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి విద్య ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించుకోవాలని సూచించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత అంశంపై క్విజ్ ఏర్పాటు చేసి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఖాజా, ఉపాధ్యాయులు రుబీన, రాజేశ్వరి, వెంకటమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ సుధాకర్

భక్తిశ్రద్ధలతో షష్టి పూజలు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని గంగ, గౌరీ సమేత మరకతలింగేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే నవగ్రహాల్లోని శుక్రుడికి విశేష అభిషేక, అర్చనలు చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేసుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.



మరకతలింగేశ్వరస్వామి

విజయమే లక్ష్యంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వర రెడ్డి

ఆత్మకూరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి అండగా ఉండాలని ప్రజలను కోరాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఏపీ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. శుక్రవారం డిపో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు డిపో నుంచి శ్రీశైలానికి 40 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. రుద్రకోడూరుకు 10, సంగమేశ్వరానికి 5 సర్వీసులతో పాటు బనగానపల్లె నుంచి 10, డోన్ 15, కోవెలకుంట్ల 15, నందికొట్కూరు 37, నంద్యాల 40, కర్నూలు 120, ఆదోని 75, ఎమ్మిగనూరు 75 బస్సులతో దాదాపు 425 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. శివరాత్రికి వెళ్లే భక్తులు, శివస్వాములు ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ సీఐ కోటయ్యనాయక్ పాల్గొన్నారు.

స్నాన ఘట్టాలను పరిశీలించిన డీఎస్పీ



పాతాళగంగ మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

శ్రీశైలం: మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కావడంతో భక్తులకు స్నాన ఘట్టాల వద్ద చేసిన సౌకర్యాలను ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాస్, స్థానిక సీఐ ప్రసాద్, వన్, టూటౌన్ ఎస్ఐలు.. దేవస్థానం ఈఈ రామకృష్ణతో కలిసి పరిశీలించారు. పాతాళగంగ మెట్ల మార్గంతో పాటు దుస్తులు మార్చుకునే గదులు, స్నానఘట్టాలు, మంచినీటి సౌకర్యాలపై పర్యవేక్షణ చేశారు. పుణ్యస్నానాలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని గజ ఈతగాళ్లకు సూచించారు. మైక్ ఏర్పాటు చేసి భక్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు.

మద్యం స్వాధీనం

శ్రీశైలం: బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలు.. శ్రీశైలం కొత్తపేటలో నివసిస్తున్న ఆకుల వంశీ అలియాస్ సన్ని బైక్‌పై 180ఎంఎల్ 30బాటిళ్లను తీసుకొని వస్తుండగా ఎస్ఐ లక్ష్మణరావు, వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం టోల్‌గేట్ వద్ద తనిఖీలో పట్టుబడ్డారు. వారిని అరెస్ట్ చేసి బైక్, మద్యం స్వాధీనం చేసుకున్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి

● వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్

పాములపాడు: జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బానుముక్కల, చెలిమిల్ల, లింగాల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. చెలిమిల్ల గ్రామంలో పక్షవాతంతో బాధపడుచున్న వెంకటేశ్వరరావు చేయి పట్టుకొని ఎప్పటి నుంచి బాధపడుతువ్వారని ఆరా తీశబూరు. క్రమం తప్పకుండా వ్యాయామం చేసుకుంటూ వ్యాధి నయమవుతుందని సలహా ఇచ్చారు. అనంతరం కంబాలపల్లి గ్రామంలో మస్తాన్ వలి దర్గాను దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, నాయకులు విజయసింహారెడ్డి, చౌడయ్య, బాలీశ్వరరెడ్డి, రామిరెడ్డి, బాలసుబ్బారెడ్డి, రామక్రిష్టారెడ్డి, మధుసూదన్‌రావు, శేషులు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని తుమ్మలూరు గ్రామంలో సర్పంచు వరప్రసాద్ అధ్యక్షతన గృహ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను డాక్టర్ దారా సుధీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్ద పీట వేశారన్నారు. జగనన్న కాలనీల్లో స్థలాలు, పక్కా గృహాలకు మహిళలనే లబ్ధిదారులు చేసి, రిజిస్ట్రేషన్ కూడా ఉచితంగా చేయించారన్నారు. మేలు చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలన్నారు.



పక్షవాతంతో బాధపడుతున్న వెంకటేశ్వరరావును పలకరిస్తున్న డాక్టర్ సుధీర్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. నిత్యకళారాధన వేదిక, పుష్కరిణి వద్దనున్న భ్రామరీ కళావేదిక, శివదీక్షా శిబిరాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు భక్తులను తమ నృత్యప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.



నృత్య ప్రదర్శనలో కళాకారులు

క్లుప్తంగా

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా సాగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో కొలువుంచి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామి వార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. ధ్వజస్తంభం వద్ద స్వామి, అమ్మవార్లకు హారతులు ఇచ్చి మహానందీశ్వర దంపతులను యాగశాలకు చేర్చారు.

సాంకేతిక పద్ధతులు పాటించాలి

నందికొట్కూరు రూరల్: వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆత్మ డీపీడీ శ్రీలత రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో ఆమె రైతులతో మాట్లాడారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, డీఆర్‌సీటీఏ శశిధరరెడ్డి, ఏఓ షేక్షావలి, ఆత్మ బీటీఎం చక్రవర్తి, వీఏఏ శాంతిరాజు పాల్గొన్నారు.

పోలియోను నిర్మూలిద్దాం

మహానంది: రెండు చుక్కల మందుతో పోలియోను నిర్మూలిద్దామని గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ అంబమ్మ, తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఈఓ హుస్సేన్ రెడ్డి తెలిపారు. మహానందిలోని గిరిజన ఆశ్రమం పాఠశాల విద్యార్థులతో శుక్రవారం పల్స్ పోలియో ర్యాలీ నిర్వహించారు. 3వ తేదీ జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త హేమలత, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఆశ కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మొదటి రోజు 86 శాతం పూర్తి

నందికొట్కూరు: సామాజిక పింఛన్లు మొదటి రోజు 87 శాతం పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పింఛన్లు పంపిణీ చేపట్టారు. 5,043 పింఛన్లకు గానూ 86 శాతం మందికి పింఛన్లు కౌన్సిలర్లు, వలంటీర్లు పంపిణీ చేశారు. మిగతా వారికి ఒకటి, రెండు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు.

80 శాతం పంపిణీ

మిడుతూరు: మండల పరిధిలో 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. 5,515 మంది పింఛనర్లకు గానూ 4,341 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు.

కొత్తపల్లి: మండలంలో పింఛన్ల పంపిణీ 62.16 శాతం పూర్తయిందని ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. 4,313 మంది పింఛనర్లకు గానూ 2,681 మందికి మొదటి రోజు పంపిణీ చేశామని, మిగతా వారికి వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకుంటున్న సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా సుధాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్: శ్రీశైలం, నందికొట్కూర్ నియోజకవర్గాల్లో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బండిఆత్మకూరులో 9 మంది, వెలుగోడులో 19, పాములపాడు ఇద్దరు, జూపాడుబంగ్లా ఇద్దరు, మిడుతూరు ఐదుగురు, శ్రీశైలం 16, నందికొట్కూరు 43 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయా కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.

నీటి సమస్య లేకుండా చూస్తాం

కొత్తపల్లి: తాగునీటి సమస్య లేకుండా చూస్తామని కో–ఆప్టెడ్ మెంబర్ షేక్ మహమ్మద్ గౌస్ అన్నారు. శుక్రవారం శివపురం గ్రామంలో నీటిసమస్య పరిష్కారానికి బోరు బావి తీసేందుకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కొలనుభారతి ఆలయ కమిటీ చైర్మన్ వెంకటనాయుడు, సర్పంచు చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ

ఆత్మకూరు: పట్టణంలోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో శుక్రవారం మాలమహానాడు కార్యకర్తల సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వెంకటరమణ, మండల అధ్యక్షుడిగా సుధాకర్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, బొజ్జన్న, ప్రధాన కార్యదర్శిగా క్రిష్టఫర్, కోశాధికారిగా రాఘవేంద్ర, కార్యదర్శిగా శీనుతో పాటు పలు విభాగాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జిల్లా యూత్ అధ్యక్షులు వాడాల త్యాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వం

- శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధారరెడ్డి



మంచినీటి ట్యాంకరులను ప్రారంభిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: పట్టణ ప్రజలకు తీగునీటి సమస్య తలెత్తనివ్వం అని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధారరెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద తాగు నీటిని సరఫరా చేసే రెండు ట్యాంకర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ట్యాంకర్లను సిద్ధం చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి పాలనలో రూ.30 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రజలు దాహంతో అల్లాడిపోతున్నా అప్పటి పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో మున్సిపాలిటీని నందనవనంగా తీర్చిదిద్దారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీలను జగనన్న అమలు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు రాధిక, శాంతకుమారి, చింత లక్ష్మీదేవి, కృష్ణవేణి, సురేష్, కృష్ణ, చాంద్‌బాషా, అశోక్, లాలు ప్రసాద్, రవూఫ్, కో ఆప్సన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గఫార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

పగిడ్యాల: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ శుక్రవారం తెలిపారు. పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన గంగి రమణ మరో ఇద్దరు బైక్‌పై నందికొట్కూరు నుంచి 50 మద్యం బాటిళ్లు తరలిస్తూ లక్ష్మాపురం అంచె వద్ద పట్టుబడ్డారన్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం జగనన్న కాలనీలో ఇళ్లస్థలాలు మంజూరైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను శుక్రవారం సర్పంచ్ నాగార్జునరెడ్డి అందజేశారు.



సురక్ష శిబిరాలు పేదలకు వరం



ఉచితంగా మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

జూపాడుబంగ్లా: జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాలు పేదలకు వరమని ఎంపీడీఓ సూర్జహాన్, డాక్టర్ గంగాధర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తగోవుల గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్లు గంగాధర్, పూర్ణేశ్వర్, ప్రవీణ్ తదితరులు 900 మందికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఐదుగురికి కంటి అద్దాలు ఇచ్చారు. 10 మందిని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

➢ కొత్తపల్లి: మండల పరిధిలోని కొక్కెరంచ గ్రామంలో వైద్యులు విజయేంద్ర, రాయుడు, జుబేద తదితరులు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించి 410 మందికి పలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ జవహర్ బాబు, సర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

➢ మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. డాక్టర్ రాజు హాజరై పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సర్పంచ్ భారతి పాల్గొన్నారు.

➢ మహానంది: బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన పలువురికి డాక్టర్ భావన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీడీఓ విజయరావు, సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

కేసు నమోదు

పగిడ్యాల: తనపై దాడి చేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు తొమ్మిది మంది నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. పడమర వనములపాడు గ్రామానికి చెందిన జానకమ్మను అదే గ్రామానికి చెందిన బోయ రామదీక్షతో పాటు మరో 8 మంది నీటి మునక పొలం విషయంలో తగాదా పెట్టుకుని మూకుమ్మడిగా దాడి చేశారన్నారు.





శివభక్తుల సేవలో పలువురు

శ్రీశైలంప్రాజెక్ట్/నందికొట్కూర్/జూపాడుబంగ్లా: మహాశిరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి శ్రీశైలంలో ప్రారంభమయ్యాయి. కాలినడకన అడవి మార్గంలో వచ్చే శివభక్తులకు దాతలు దారి పొడవునా అన్నదాన శిబిరాలు, చలివేంద్రాలు, వైద్య శిబిరాలు, విశ్రాంతి షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు మధ్యాహ్నం ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకొని భోజనానంతరం వాతావరణం చల్లబడిన తరువాత కాలినడక ప్రయాణం చేస్తే మంచిదని దేవస్థానం అధికారులు, అటవీ అధికారులు సూచిస్తున్నారు.

➡ ఆత్మకూరు ప్రాంతం నుంచి నాగలూటి మీదుగా వచ్చే భక్తులకు నాగలూటి ఆంజనేయస్వామి గుడి వద్ద కె.నారాయణశర్మ, వీరభద్రస్వామి గుడి వద్ద ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, నాగలూటి గూడెం వద్ద ఎం.తిరుపతయ్య, పెద్దచెరువు వద్ద ఎస్.చిన్న ఆదెన్న, జి.మోహన్‌కుమార్, వట్టి వెంకటరెడ్డి, భీముని కొలను వద్ద వివేకానందరెడ్డి, కైలాసద్వారం వద్ద మురళీధర్‌రెడ్డి, ఎం.మధుకృష్ణ, దామర్లకుంట వద్ద ఎస్ఎ సుదర్శన్‌కుమార్, ఇస్కాన్ ఏఎంసీ వారు, తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే భక్తులకు ఏపీ జెన్‌కో డ్యాం వ్యూపాయింట్ వద్ద అన్నదాన శిబిరం ఏర్పాటు చేశారు.

➡ శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు నందికొట్కూరులో దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

➡ జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేజీ రోడ్డుపై ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సభా భక్తులకు సూచించారు.

ఆత్మకూరు: నాగలూటి క్షేత్రం వద్ద వైద్యాధికారి పవన్‌కుమార్ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

➡ ఆత్మకూరు సమీపంలోని డీపాల్ పాఠశాల వద్ద ఫ్రెండ్‌షిప్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ నాగభూషణం ప్రారంభించారు.

వ్యక్తిని కాపాడిన అటవీశాఖ సిబ్బంది



డోలీ సాయంతో వ్యక్తిని తరలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: ప్రాణపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని అటవీశాఖ సిబ్బంది కాపాడారు. శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్రగా వచ్చే భక్తులకు అవసరమైన తినుబండారాలు అందించేందుకు భీమునికొలను వద్ద సున్నిపెంటకు చెందిన పర్వతాలునాయక్ తాత్కాలిక కొట్టు ఏర్పాటు చేసుకున్నాడు. శుక్రవారం పర్వతాలునాయక్‌కు కాలు, చేతులు పడిపోయి, మాటలు రాకపోవడంతో కుటుంబ సభ్యులు కొంత దూరం తీసుకువచ్చి సెల్ ఫోన్ సిగ్నల్ రాగానే కైలాసద్వారం వద్ద అటవీశాఖ హెల్ప్‌లైన్ డెస్క్‌కు ఫోన్ చేశారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని డోలీ సాయంతో అతడిని సున్నిపెంట వైద్యశాలకు తరలించి వైద్యం చేయించడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు.

